సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 27 । అక్టోబర్ । 2024



తప్పిన దానా ముప్పు..వరించిన సిరులు

జిల్లాలో దానా తుపాను ప్రభావం లేకపోవడంతో వరి రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో పంట కోత పనుల్లో నిమగ్నమయ్యారు. పెదబయలు మండలంలో లక్ష్మీపేట, అల్లంపుట్టు, అడుగులపుట్టు తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా జరుగుతున్నాయి. జిల్లాలో ఖరీఫ్‌లో 56 వేల హెక్టార్లలో సాగు చేపట్టారు. ఈ సీజన్‌లో ఎంటీయూ 1121, ఎంటీయూ 1064, ఎంటీయూ 1061, ఇసుక రవ్వలు, సన్నధాన్యం, నిమ్మలసిరి , ఎంటీయూ 1010 రకాలు సాగు చేపట్టారు. వీటిలో వర్షాధారంగా సాగు చేపట్టిన భూముల్లో పైరు పక్వానికి రావడంతో పంట కోత పనుల్లో నిమగ్నమయ్యారు. –పెదబయలు

న్యూస్‌రీల్

అరకు ఎంపీకి సముచిత స్థానం

- రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ కమిటీలో సభ్యురాలిగా నియామకం
- పార్లమెంట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ



సాక్షి, పాడేరు: అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజ రాణికి మరో కీలక కమిటీలో కేంద్ర ప్రభుత్వం సముచిత స్థానం కల్పించింది. రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వశాఖ కమిటీ సభ్యురాలుగా నియమిస్తూ పార్లమెంట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఆమె కేంద్ర ప్రభుత్వం పరిధిలోని హౌసింగ్, జాతీయ ఇతర వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ సభ్యురాలుగా ఉన్నారు. అదనంగా రోడ్డు రవాణా జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ కమిటీ సభ్యురాలుగా నియమించడంపై పార్లమెంట్ పరిధిలోని అన్ని వర్గాల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. ఆమెకు అభినందనలు తెలుపుతున్నారు.

మలేరియా, డెంగ్యూపై మరింత అప్రమత్తం

- జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతిప్రభ



మినుములూరు పీహెచ్‌సీ సిబ్బందితో జోనల్ మలేరియా అధికారి డాక్టర్ శాంతిప్రభ

పాడేరు : మలేరియా, డెంగ్యూ జ్వరాలపై వైద్య సిబ్బందితో పాటు ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ వి. శాంతిప్రభ సూచించారు. శనివారం ఆమె మండలంలోని మినుములూరు పీహెచ్‌సీని సందర్శించారు. ఇటీవల నమోదైన మలేరియా, డెంగ్యూ కేసుల వివరాలనుతెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం కందమామిడి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్యాధికారి సాయిశ్రీ, అసిస్టెంట్ మలేరియా అధికారి శేషయ్య, ఆరోగ్య విస్తరణాధికారి గుల్లేలి సింహాద్రి, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ్ పాల్గొన్నారు.

కన్నవారికి కడుపుకోత



ఈ ఫొటోలో ఉన్న 14 మంది విద్యార్థులు ఏలూరు ఆశ్రం వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సెకండ్ ఇయర్ చదువుతున్నారు. సెప్టెంబరు 22న కాకినాడ వచ్చారు. స్నేహితులతో కలిసి బీచ్‌లో ఎంజాయ్ చేశారు. అక్కడి నుంచి మారేడుమిల్లి మండలంలోని జలతరంగిణి సందర్శనకు వచ్చారు. జలపాతంలోకి దిగి స్నానాలు చేస్తున్న సమయంలో భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా కొండవాగులు పొంగడంతో జలపాతం ఉధృతి పెరిగి ఐదుగురు కొట్టుకుపోయారు. వీరిలో ఇద్దరిని అక్కడే ఉన్న తోటి పర్యాటకులు రక్షించి బయటకు తీశారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులు గల్లంతయ్యారు. వీరిలో ఇద్దరు యువతుల మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయి. రోజుల తరబడి గాలించినా యువకుడి మృతదేహం మాత్రం లభ్యం కాలేదు. కన్నవారికి చివరి చూపుకూడా దక్కని దయనీయ పరిస్థితి నెలకొంది.

రెండు రోజుల తరువాత మృతదేహం లభ్యం




రవితేజ (ఫైల్)

ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం చేబ్రోలుకు చెందిన ఈ ఫొటోలో యువకుడి పేరు కరణం రవితేజ (26). ఈవెంట్ డెకరేషన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 18న పది మంది స్నేహితులతో కలిసి విహారయాత్రకు బయలుదేరాడు. చింతూరు మండలం సోకులేరు వాగు వద్దకు వచ్చిన వారు వాగులోకి దిగారు. అందరూ కలిసి స్నానం చేస్తుండగా రవితేజ కొట్టుకుపోయాడు. వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు. రెండు రోజుల తరువాత అతని మృతదేహాన్ని సోకులేరు వ్యూపాయింట్‌కు సుమారు కిలోమీటరు దూరంలో గుర్తించారు.

అత్యుత్సాహం.. ఆదమరిస్తే విషాదం

మన్యంలోని ప్రకృతి సోయగాలను తిలకించేందుకు, జలపాతాల సవ్వడులు తనివితీరా చూసేందుకు దేశ, విదేశాల నుంచి సందర్శకులు వస్తుంటారు. కొత్త ప్రదేశాలను చూసి తన్మయత్వానికి లోనై ప్రమాదాల బారిన పడుతున్నారు. జాగ్రత్తలు పాటించక ప్రాణాలమీదకు తెచ్చుకోవడంతో విహారయాత్రలు కాస్తా విషాదంగా మారుతున్నాయి.

- మృత్యుకుహరాలుగా జలపాతాలు
- జాగ్రత్తలు పాటించక ప్రమాదాలకు గురవుతున్న సందర్శకులు





డుడుమ వద్ద గల్లంతైన వారి కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం (ఫైల్)



తారాబు జలపాతం వద్దకు కర్రల వంతెనపై నుంచి వెళ్తున్న పర్యాటకులు

ముంచంగిపుట్టు: మన్యంలో సందర్శనీయ ప్రాంతాలను ప్రభుత్వాలు అభివృద్ధి చేయడంతో సందర్శకుల రాక పెరిగింది. జలపాతాల సందర్శనకు ఏడాది పొడవునా వస్తుంటారు. కార్తీక మాసం మొదలుకుని దాదాపు మార్చి వరకు వీరి సంఖ్య ఎక్కువగా ఉంటుంది.

- ముంచంగిపుట్టు మండలంలో ఆంధ్రా– ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో ఉన్న డుడుమ జలపాతం 556 అడుగుల ఎత్తునుంచి జాలువారుతుంది. జలపాతం వద్దకు వెళ్లాలంటే 800 మెట్లు దిగాలి. జలపాతం దిగువ భాగంలో నీటి ప్రవాహ ఉధృతికి రాళ్ల కోతకు గురై సొరంగాలు ఏర్పాడ్డాయి. ఇక్కడ ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ప్రాణాల మీదకు తెచ్చుకున్నట్టే.
- ఇదే మండలంలో జడిగూడ, బురదగుంట, హంసబంద, అనంతగిరి మండలంలో సరియా, కటికి, తాటిగూడ, డుంబ్రిగుడ మండలంలో చాపరాయి జలపాతాల వద్ద ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి.

డుడుమ జలపాతం వద్ద అదుపు తప్పి..

- 2013: డుడుమ జలపాతం సందర్శనకు వచ్చిన పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరుకు చెందిన మహిళ జలపాతం వద్దకు వెళ్తుండగా అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. జలపాతంలో గల్లంతయ్యింది. దాదాపుగా 11 రోజుల తరువాత మృతదేహం బయటపడింది.

సెల్ఫీ తీసుకుంటూ కాలుజారి..

- 2022: విశాఖలోని మధురవాడకు చెందిన ఆరుగురు స్నేహితులు డుడుమ జలపాతం సందర్శనకు వచ్చారు. సెల్ఫీ తీసుకుంటుండగా వీరిలో ఒకరు కాలుజారి జలపాతంలో పడిపోయాడు. రెండు రోజుల తరువాత అతని మృతదేహం లభ్యమైంది.

సందర్శనకు వచ్చి విగతజీవిగా..

- 2023: ఒడిశాలో కొరాపుట్టు జిల్లా జయపురం గ్రామానికి చెందిన యువకుడు డుడుమ జలపాతం సందర్శనకు వచ్చాడు. స్నానం చేస్తుండగా గల్లంతయ్యాడు. ఒడిశాకు చెందిన ఓడీఆర్ఎఫ్ బృందాలు వెంటనే గాలింపు చేపట్టాయి. మూడు రోజుల తరువాత మృతదేహాన్ని గుర్తించారు.

జారిపడి గల్లంతు..

- 2024: అరకు ప్రాంతానికి చెందిన ఓ యువకుడు తారాబు జలపాతం సందర్శనకు వచ్చాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి జలపాతంలో పడిపోయాడు. మూడు రోజుల తరువాత అతని మృతదేహం బయటకు తేలింది.

సెక్యూరిటీ గార్డు ఏర్పాటు

డుడుమ జలపాతం వద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులకు సూచనలిచ్చాం. ఒడిశాకు చెందిన పర్యాటకశాఖ అధికారులు జలపాతం వద్ద సెక్యూరిటీ గార్డును నియమించారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. జలపాతం వద్దకు వచ్చి గల్లంతై ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. పర్యాటకులు జాగ్రత్తలు పాటిస్తూ ఎటువంటి రిస్క్ చేయకుండా సందర్శించి వెళ్లాలి. – ఏవీ సుబ్రహ్మణ్యేశ్వరావు, ఎస్ఈ, మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం

అజాగ్రత్త వల్లే ప్రమాదాలు



జలపాతాల వద్ద ప్రమాదాలు జరగకుండా ముందస్తుగానే అధికారులకు సూచనలిచ్చాం. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. అయినప్పటికీ సందర్శనకు వచ్చే వారు ఇవేవీ లక్ష్యపెట్టడం లేదు. సెల్ఫీలు, ఫొటోలు తీసుకున్నప్పుడు అజాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. దీనివల్ల కాలుజారి జలపాతంలో పడిపోతున్నారు. లోతు అంచనా లేని ప్రాంతాల్లో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇవేమీ పట్టించుకోకుండా వ్యవహరిస్తూ ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. – కె.ధీరజ్, ఏఎస్పీ, పాడేరు

బయోస్పియర్ రిజర్వ్‌గా మర్రిపాకల అటవీ ప్రాంతం

- చింతపల్లి డీఎఫ్‌వో నర్సింగరావు



అటవీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న కలపను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో నర్సింగరావు

కొయ్యూరు: రెండు లక్షల హెక్టార్లతో మర్రిపాకల అటవీప్రాంతాన్ని బయోస్పియర్ రిజర్వ్‌గా ఏర్పాటుకు ప్రతిపాదిస్తున్నామని చింతపల్లి డీఎఫ్‌వో వైవీ నర్సింగరావు తెలిపారు. రంపచోడవరం, చింతూరు డీఎఫ్‌వోలతో కలిసి మొత్తం నాలుగు వైపులా ఉన్న అడవితో బయోస్పియర్ రిజర్వ్ చేసేందుకు ప్రణాళికతో పనిచేస్తున్నామన్నారు. శనివారం ఆయన మండలంలోని కాకరపాడు డిపోలో నిర్వహించిన కలప వేలంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. దట్టమైన అడవితో ఉన్న ప్రాంతాన్ని బయో రిజర్వ్‌గా చేస్తే అటు జంతువులు ఇటు చెట్లకు రక్షణ ఉంటుందన్నారు. ఈ ప్రాంతం బయో రిజర్వ్‌కు ఎంపికైతే యునెస్కో నుంచి నిధులు వస్తాయన్నారు. చింతూరు, రంపచోడవరం డీఎఫ్‌వోలతో సంప్రదించి 40 రోజుల్లో నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. మర్రిపాకలలో సహజసిద్ధమైన అడవి ఉందన్నారు. ఈ ప్రాంతంలో విలువైన కలప తరలిపోకుండా అదనపు సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ఉన్న అడవిని కాపాడటమే కాకుండా స్మగ్లర్లపై కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. కొందరు విద్యుత్ తీగలు అమర్చి జంతువులను వేటాడుతున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పెదవలస రేంజర్ శివరజని, సెక్షన్ అధికారి నూకరాజు ఉన్నారు.



సుబ్రమణ్యేశ్వర స్వామి విగ్రహం అపహరణ

8లో

భార్య ప్రాణాలు కాపాడేందుకు విశ్వ ప్రయత్నం

- పాము కాటుకు గురవడంతో తక్షణ వైద్యం అందించేందుకు అష్టకష్టాలు
- 15 కిలోమీటర్ల దూరంలోని ఆస్పత్రికి బైక్‌పై కూర్చోబెట్టి తీసుకెళ్లిన భర్త
- అయినా దక్కని ప్రాణం
- లువ్వాసింగిలో విషాదం



మృతి చెందిన సరస్వతి



పాడేరు జిల్లా ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: పాము కాటుకు గురైన భార్యను కాపాడేందుకు ఆమె భర్త విశ్వ ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సుమారు 15 కిలోమీటర్ల మేర ఆమెను బైక్‌పై కూర్చోబెట్టి తక్షణ వైద్యం అందించేందుకు ఆస్పత్రికి తరలించినా ప్రాణాన్ని మాత్రం కాపాడలేకపోయారు. కళ్లెదుటే తనువు చాలించడంతో ఆ హృదయం తల్లడిల్లిపోయింది. శనివారం జరిగిన ఈ హృదయ విదారక ఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లువ్వాసింగికి చెందిన దంపతులు కర్రి పడాల్, ఊలంగి సరస్వతి (45) శనివారం మధ్యాహ్నం పోడు భూమిలో వ్యవసాయ పనులు చేస్తున్నారు. ఈ సమయంలో సరస్వతిని పాము కాటు వేసింది. వెంటనే ఆమెను భర్త కర్రిపడాల్ హుటాహుటిన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడి నుంచి బైక్‌పై 15 కిలోమీటర్ల దూరంలోని స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చాడు. ఇక్కడి వైద్యులు వెంటనే ప్రథమ చికిత్స అందించారు. అప్పటికే ఆందోళనకు గురైన బాధితురాలి భర్త అక్కడి నుంచి పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. ఇలావుండగా జి.మాడుగుల పీహెచ్‌సీలో వైద్యులు సకాలంలో స్పందించి మెరుగైన వైద్యం అందించకపోవడమే వల్ల సరస్వతి మృతి చెందిందని ఆమె సోదరుడు వి.సన్యాసయ్య ఆరోపించారు. దీనిపై వైద్యాధికారి రవి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా తక్షణ వైద్యం అందించేందుకు తమ వంతు ప్రయత్నం చేశామని తెలిపారు. ఈలోగా 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లిపోయారని ఆయన వివరణ ఇచ్చారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

సరస్వతి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆస్పత్రికి వెళ్లారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంబులెన్సు సమకూర్చకపోవడం వల్ల బైక్‌పై కూర్చోపెట్టి పాడేరు ఆస్పత్రికి తీసుకురావాల్సి వచ్చిందని మృతురాలి భర్త ఎమ్మెల్యే వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌తో మాట్లాడారు. అత్యవసర కేసులకు సకాలంలో ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్సులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు.

గల్లంతైన గిరిజనుడి కోసం ముమ్మర గాలింపు

- మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం నుంచి నీటి విడుదల నిలిపివేత
- మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆగిన ఉత్పత్తి



గాలింపు చేపట్టిన పోలీసులు, అధికారులు

ముంచంగిపుట్టు: మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం దిగువ ప్రవాహంలో శుక్రవారం సాయంత్రం చేపల వేటకు వెళ్లి గల్లంతైన కుదుగూడకు చెందిన గిరిజనుడు శుక్రగొల్లోరి (53) కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల ఎక్కువగా ఉన్నందున గాలింపునకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మాచ్‌ఖండ్ పోలీసులు, జలవిద్యుత్ కేంద్రం అధికారులతో మాట్లాడి నీటి విడుదలను నిలిపివేయించారు. దీంతో శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు గంటకు 80 మెగావాట్ల చొప్పున విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. ఆ తరువాత నుంచి నీటి విడుదల పునరుద్ధరించడంతో ఉత్పత్తి ప్రారంభమైంది. గిరిజనుడి ఆచూకీ మాత్రం లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు.

ఉచిత డీఎస్సీ శిక్షణకు నేటితో ముగియనున్న దరఖాస్తు గడువు

పాడేరు : ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత రెసిడెన్షియల్ శిక్షణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 27 వరకు గడువు ఉందని ఎస్సీ సంక్షేమ శాఖ సాధికారత జిల్లా అధికారి జి.జనార్దనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

సుబ్రమణ్యేశ్వర స్వామి విగ్రహం అపహరణ

చింతూరు: వీఆర్‌పురం మండలం వడ్డిగూడెం శివాలయంలోని సుబ్రమణ్యేశ్వర స్వామి విగ్రహం అపహరణకు గురైంది. శనివారం ఉదయం విగ్రహం ఉండే పీఠం ధ్వంసమై ఉండటాన్ని గమనించిన స్థానికులు ఆలయ నిర్వాహకులకు సమాచారం అందించారు. రాత్రి సమయంలో దుండగులు పీఠాన్ని ధ్వంసం చేసిన విగ్రహాన్ని ఎత్తుకెళ్లి వుంటారని గ్రామస్తులు తెలిపారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

అపార్ నమోదు ప్రక్రియ వేగవంతం



తాళ్లపాలెం స్కూల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో సత్యనారాయణదొర

రాజవొమ్మంగి: కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం అమలుచేస్తున్న అపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంఈవో సత్యనారాయణదొర హెచ్ఎంలను కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న అపార్ నమోదు కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా అపార్ నమోదుకు పలు సూచలిచ్చారు. ఇందులో విద్యార్థుల చదువు అర్హతలను పొందుపరచనున్నట్టు చెప్పారు. మండలంలో అపార్ ప్రక్రియ 30 శాతం జరిగినట్లు చెప్పారు. ఆధార్‌లో తప్పులు ఉన్న వారు సమీపంలోని ఆధార్ కేంద్రానికి వెళ్లి సరిదిద్దుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంఈఓ -2 సూరయ్యరెడ్డి, సీఆర్‌పీ విష్ణు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వసుధ

రంపచోడవరం: జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె వసుధ అన్నారు. డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాబ్ మేళాకు 42 మంది హాజరు కాగా 12 మంది ఉద్యోగ అవకాశాలు పొందినట్టు చెప్పారు. యువత నైపుణ్యాలను పెంచుకుని, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. జిల్లా ఉపాధి అధికారి పి.రోహిణి, వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారకులపై చర్యలకు డిమాండ్



పాడేరులో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ, గిరిజన సమాఖ్య ప్రతినిధులు



అరకులో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ సభ్యులు

పాడేరు : అరకులోయ గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న బడ్నాయిని ప్రవీణ్‌కుమార్ అనే గిరిజన విద్యార్థి మృతికి పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కారణమని తక్షణమే విచారణ జరిపించి కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్ కృష్ణ, గిరిజన సమాఖ్యా జిల్లా కార్యదర్శి రాధకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పలువురు విద్యార్థులతో కలిసి ఐటీడీఏ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వైస్ ప్రిన్సిపాల్ దాడి వల్ల తీవ్రంగా గాయపడిన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో తరచుగా ఇటువంటి సంఘటనలు జరుగుతున్నా అధికారులల్లో చలనం లేదన్నారు. ఇలాంటి ఘటనపై కఠిన చర్యలు తీసుకోని భవిష్యత్‌లో పునారావృతం కాకుండా చర్యలు తీసుకోవలన్నారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అకులోయ టౌన్: అరకులోయ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా ప్రవీణ్‌కుమార్ మృతికి కారణమైన వైస్ ప్రిన్సిపాల్‌పై కఠిన చర్యలు తీసుకొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి అరెస్టు చేసి, మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోని రూ 10 లక్షలు ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ దాడి వల్లే విద్యార్థి మృతి చెందినట్టు కుటుంబీకులు చెబుతున్నారన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో తరచు విద్యార్థులు మరణిస్తున్నా ఐటీడీఏ అధికారులు , రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చనిపోతున్న కనీసం సమగ్ర విచారణ జరగడం లేదన్నారు. ఆశ్రమ విద్యార్థుల మృతిపై అధికారులు, ప్రభుత్వం నిర్లక్ష్యంపై భవిష్యత్తులో పెద్ద ఉద్యమాన్ని చేపడతామని వారు హెచ్చరించారు.



కొయ్యూరులో మాట్లాడుతున్న రాజశేఖర్, నేతలు



ముంచంగిపుట్టులో మాట్లాడుతున్న నాయకులు

ముంచంగిపుట్టు: అరకులోయ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ మృతికి కారకుడైన వైస్ ప్రిన్స్‌పాల్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వైస్ఎంపీపీ పి.సత్యనారాయణ, సిపిఎం నేతలు భీమారాజు, గాసి రాందొరలు డిమాండ్ చేశారు. వారు శనివారం సమావేశం నిర్వహించి, విద్యార్థి మృతిపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుడి కుటుంబానికి రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

కొయ్యూరు: అరకులోయ గురుకుల పాఠశాలలో రవికిరణ్ అనే విద్యార్థి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థిని గట్టిగా కొట్టడంతో పరిస్థితి విషమించి, చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఆరోపణలు వస్తున్నాయని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన విద్యార్థుల మరణాలపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. బాధితుని కుటుంబానికి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, బాధిత కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. నాయకులు సిద్దార్థ, చంటి, వంశీ, శ్యామ్యూల్, రాము పాల్గొన్నారు.

కాఫీ కార్మికుల ఆందోళన



చుట్టుమెట్ట కాఫీ ప్లాంటేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కాఫీ కార్మికులు

పెదబయలు: ఏపీఎఫ్‌డీసీ కాఫీ ప్లాంటేషన్‌లో పని చేస్తున్న కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం చుట్టుమెట్ట కాఫీ ప్లాంటేషన్ కార్యాలయం ఆవరణలో జిల్లా కాఫీ కార్మికుల సంఘం నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వీడీఏ పాయింట్ల ప్రకారం కార్మికుల రోజువారి కూలీ రేట్లు రూ.342.46 పైసలు,కాఫీ పండ్ల సేకరకు కిలోకు రూ.6 పెంచాలని, కార్మికులకు ఈపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, వారం వారం పేమెంట్లు చేయాలని, ప్రమాదాలు జరిగితే వైద్య ఖర్చులు ఇవ్వాలని, ప్లాంటేషన్ కండక్టర్స్‌ను నియమించాలని,హెల్పర్లకు పదోన్నతులు కల్పించాలని, కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని నినాదాలు చేశారు. ఏళ్ల తరబడి పోరాటం చేస్తున్న ప్రభుత్వం, ఏపీఎఫ్‌డీసీ అధికారులు స్పందించడం లేదన్నారు. కార్మికుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. చుట్టుమెట్ట కాఫీ ప్లాంటేషన్‌లో పని చేస్తున్న కాఫీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో నవంబర్ 1 నుంచి కార్మికులు సమ్మె చేస్తామని హెచ్చరించారు. కాఫీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుందర్‌రావు, నేతలు సిద్దేశ్వరరావు, స్వామి, కొండబాబు, బాబు, పెద్దలక్ష్మీ, రాధమ్మ, తుల్లమ్మ, రాధ, మణి, కార్మికులు పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

మోతుగూడెం: మోటారు బైక్‌పై తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకొని ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శివనారాయణ తెలిపారు. గంజాయి రవాణాపై కచ్చితమైన సమాచారం రావడంతో శనివారం నిర్వహించిన తనిఖీల్లో నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. ఒడిశా రాష్ట్రం తపతోట్టి గ్రామం నుంచి ఖమ్మం జిల్లాకు తరలిస్తున్న 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి విలువ రూ.లక్షా 10 వేలు ఉంటుందన్నారు. ఈ కేసులో ఒక మోటార్ బైక్, రెండు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు తెలిపారు. ఒడిశా ప్రాంతం మల్కన్‌గిరి జిల్లా అల్లూరికోటకు చెందిన ముయిన్‌గొల్లారి, చింతూరు మండలం ఏజీ కోడేరు పల్లి గ్రామానికి చెందిన కిలో దేబోలను అరెస్టు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో హెచ్‌సీ పురుషోత్తం, పీసీ ఎస్.ఆర్.కె.రాజు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన కల్పించండి

ఎస్పీ అమిత్ బర్దర్



మాట్లాడుతున్న ఎస్పీ అమిత్ బర్దర్

పాడేరు : గంజాయి అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ అమిత్ బర్దర్ సూచించారు. శనివారం స్థానిక వీఆర్ కళ్యాణ మండపంలో ఐటీడీఏ పరిధిలో మహిళా పోలీసులతో (గ్రామ సచివాలయ సంరక్షణ కార్యదర్శులు) నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి కట్టడి చేయడంలో గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసుల పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. దేశంలో గంజాయి ఎక్కడ పట్టుబడినా దాని మూలాలు అల్లూరి సీతారామరాజు జిల్లాలోనే ఉన్నాయన్న అనవసర ఆరోపణలు వస్తున్నాయన్నారు. ఫలితంగా జిల్లాకు చెడ్డ పేరు వస్తోందన్నారు. గంజాయి వ్యవహారంలో ప్రమేయం ఉన్న చాలా మంది వ్యక్తులు జైళ్లలో మగ్గుతున్నారని, దీంతో వారి కుటుంబాలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. గంజాయి సేవించడం చాలా ప్రమాదకరమన్నారు. వీటిపై గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు తెలియజేయాలని సూచించారు. గంజాయి సమాచారం తెలిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అనారోగ్య సమస్యలతోనే గిరిజన విద్యార్థి మృతి

గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ రజిని

సాక్షి,పాడేరు: అరకులోయ గిరిజన గురుకుల పీవీటీజీ పాఠశాలలో చదువుతున్న టెన్త్ విద్యార్థి బడ్నాయిని ప్రవీణ్‌కుమార్ అనారోగ్య సమస్యలతోనే మృతిచెందాడని గిరిజన సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ ఎల్.రజిని శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23వతేదీన గిరిజన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ తీవ్రమైన జ్వరం,రక్తం వాంతులు చేసుకోవడంతో అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. అక్కడి వైద్యుల సూచన మేరకు 24వ తేదీన కేజీహెచ్‌కు రిఫర్ చేయగా అక్కడి వైద్యులు పరీక్షలు జరిపారన్నారు. కిడ్నీ, ఊపిరి తిత్తులు, లివర్ సంబంధిత సమస్యలు ఉన్నట్టు గుర్తించారన్నారు. ఈ మేరకు మెరుగైన వైద్యసేవలు కల్పించారన్నారు. అయితే వైద్యసేవలు పొందుతూ ఈనెల 25వతేదీన విద్యార్థి ప్రవీణ్‌కుమార్ మృతిచెందాడని ఆమె తెలిపారు.

వైస్ ప్రిన్సిపాల్ సస్పెన్షన్

విద్యార్థి ప్రవీణ్‌కుమార్ ఉపాధ్యాయుడు కొట్టడం వల్లే మృతిచెందాడని తల్లిదండ్రులు ఆరోపించిన నేపథ్యంలో సంబంధిత వైస్ ప్రిన్సిపాల్ వై.రామనరసింహను సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి పాడేరు ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీ చేశారని ఆమె తెలిపారు. విద్యార్థి ప్రవీణ్‌కుమార్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

గిరిజనుల జీవన ప్రమాణాల పెంపునకు ప్రత్యేక శ్రద్ధ

- జీసీసీ ఎండీతో భేటీ అయిన అరకు ఎంపీ తనూజరాణి
- సమస్యలు ప్రస్తావిస్తూ.. పరిష్కార మార్గాల వివరణ



జీసీసీ ఎండీతో చర్చిస్తున్న అరకు ఎంపీ తనూజరాణి, చెట్టి వినయ్

సాక్షి, విశాఖపట్నం: గిరిజనుల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా జీసీసీ ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తూ.. గిరిజన ప్రాంత సమగ్రాభివృద్ధికి సహకరించాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనూజరాణి సూచించారు. గిరిజన సహకార సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జీసీసీ ప్రధాన కార్యాలయాన్ని శనివారం సందర్శించిన ఎంపీ.. జీసీసీ ఎండీ కల్పనాకుమారితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులకు సంబంధించిన పలు సమస్యలను ఎండీతో ప్రస్తావిస్తూ.. పరిష్కార మార్గాలను కూడా వివరించారు. దళారీ వ్యవస్థ నుంచి కాపాడుతూ గిరిజనులకు జీవనోపాధిని కల్పించేందుకు కృషి చేయాలన్నారు. అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసి వెనువెంటనే విక్రయించకుండా జాప్యం చేస్తుండటంతో టర్నోవర్ పెరగక నష్టం వాటిల్లుతోందన్నారు. అంతర్జాతీయ కాఫీ ధరలను దృష్టిలో పెట్టుకుని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని.. ప్రస్తుతం పెంచిన ధరలపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. డివిజనల్, గిరిజన ప్రాథమిక పరపతి సహకార సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కాఫీ సేకరించిన 24 గంటల్లోగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు నేరుగా జమ అయ్యేలా విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. జీసీసీలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు ప్రమోషన్లు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. కొన్ని అనాలోచిత నిర్ణయాలతో అధికారులు, ఉద్యోగులు జీసీసీని నష్టాల బాట పట్టిస్తున్నారని ఎండీకి ఫిర్యాదు చేశారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పార్లమెంట్ సాక్షిగా గళం విప్పి.. గిరిజనుల హక్కులు, జీసీసీకి మరిన్ని అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ అంశాలకు సంబంధించి విభాగాల వారీగా ప్రణాళికలు రూపొందించి చర్యలు చేపడతామని జీసీసీ ఎండీ కల్పన హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

కలెక్టర్ దినేష్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఐటీడీఏ పీవోలు, సబ్‌కలెక్టర్లు, జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజల అకాంక్షల మేరకు జిల్లా అభివృద్ధిలో ఐటీడీఏలు భాగస్వామ్యం కావాలని సూచించారు. ఇక నుంచి ప్రతి నెలా నాలుగో శనివారం ఐటీడీఏ పీవోలతో సమావేశం నిర్వహిస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఏటా 15శాతం వృద్ధి రేటు సాధించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతీ ప్రభుత్వ శాఖలో లక్ష్యాలను ఐటీడీఏ, మండల స్థాయిలో నిర్ణయించాలన్నారు. వ్యవసాయ,ఉద్యానవన పంటల సాగు విస్తీర్ణం పెంపునకు చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హమీ పథకంలో చేపట్టిన పనుల్లో ప్రస్తుతం వస్తున్న రూ.261 సగటును రూ.290కు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోషల్ అడిట్‌లో గుర్తించిన రికవరీలను అమలుజేయాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై ఆర్ఆర్ యాక్ట్ కింద చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి సికిల్‌సెల్ ఎనిమియా నిర్ధారణ కిట్లు తెప్పించాలని, మలేరియా నివారణ చర్యలతో పాటు మాతాశిశు కార్యక్రమాలను విస్తృతం చేయాలని ఆదేశించారు. అన్ని పాఠశాలల్లోను ఉపాధ్యాయుల ముఖ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. అనంతరం అన్ని ఇంజనీరింగ్‌శాఖలతో సమీక్షించి అభివృద్ధి పనులు వేగవంతం చేసి నవంబర్ నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు అభిషేక్, కట్టా సింహాచలం, సబ్‌కలెక్టర్లు సౌర్యమన్ పటేల్, కల్పశ్రీ, డీఆర్వో పద్మావతి పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభ



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం కొండలరావు, వార్డెన్ నూకరత్నం, పీడీ వరలక్ష్మి

చింతపల్లి: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. అనకాపల్లి జిల్లా కృష్ణదేవిపేటలో ఈనెల 24, 25 తేదీల్లో జరిగిన అండర్-14 విభాగంలో ఈ పాఠశాలకు చెందిన వంతల అనిత, మర్రి శ్రావణి, జోయిస్ ప్రియ, గెమ్మెలి చిన్నారి ప్రతిభ కనబరిచారు. ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని హెచ్ఎం కొండలరావు, వార్డెన్ నూకరత్నం, పీడీ వరలక్ష్మి అభినందించారు.



వాలీబాల్ పోటీలకు ఎంపికైన గన్నెల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులతో సిబ్బంది

అరకులోయ టౌన్: ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి అండర్-14 బాలికల వాలీబాల్ జట్టు ఎంపికలో అరకులోయ మండలం గన్నెల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఆడారి ఈశ్వరి, కొర్రా దీపిక్ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం జానకమ్మ, పీడీ కొండబాబు తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించారన్నారు. వీరిని హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

మాజీ ఎమ్మెల్యే దేముడుకు ఘన నివాళి



కొయ్యూరులో దేముడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబీకులు తదితరులు



అల్లిపురంలో దేముడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కొయ్యూరు/చింతపల్లి: చింతపల్లి మాజీ ఎమ్మెల్యే గొడ్డేటి దేముడు వర్ధంతిని కొయ్యూరు మండలం వెలగలపాలెం నిర్వహించారు. గొడ్డేటి దేముడు భార్య చెల్లయమ్మ, తనయులు మహేష్, కుమార్‌ల ఆధ్వర్యంలో దేముడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకట రమణ, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ దేముడు సేవలు చిరస్మరణీయమన్నారు. నాయకులు దేముడు, రామునాయుడు, నానాజీ, డౌనూరు ఎంపీటీసీ అప్పారావు, గొలుగొండ వైస్ ఎంపీపీ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు. చింతపల్లిలో జరిగిన గొడ్డేటి దేముడు సంస్మరణ సభలో ఎంపీటీసీ సత్తిబాబు, సీపీఐ నాయకులు పోతురాజు , సత్యనారాయణ, రమణ, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అల్లిపురం: గిరిజనుల హృదయాల్లో నిజమైన దేవుడు చింతపల్లి మాజీ శాసన సభ్యుడు గొడ్డేటి దేముడు అని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. దేముడు 9వ వర్ధంతి సందర్భంగా శనివారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని దేముడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దేముడును చింతపల్లి నియోజకవర్గం నుంచి పార్టీ పోటీలో నిలిపిందన్నారు. మొదటి సారి 1994లోను, రెండవసారి 2004లోను శాసన సభ్యునిగా గెలిచి గిరిజనుల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారన్నారు. సీపీఐ ఉమ్మడి విశాఖ జిల్లా సహాయ కార్యదర్శిగాను, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగాను, గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడిగాను పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మన్మథరావు, జీఎస్‌జే అత్యుతరావు, ఎస్కే రెహమాన్, జి.కాసులరెడ్డి, నూనెల సూరిబాబు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.